క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవార్‌పేట్, బాగులవాడ, చిక్కడపల్లి, పాన్‌గల్లీ, కళానగర్, ప్రియదర్శినినగర్, ఓల్డ్ మార్కెట్, కలెక్టర్, ఎస్పీ క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, నటరాజ్ నగర్, భాగ్యనగర్, విజయనగర్ కాలనీ, గొల్లపేట్, శాస్త్రీనగర్ ఏరియా హాస్పిటల్ బర్కత్‌పుర కాలనీల్లో ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

23న సంత ప్రారంభం

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో ఈనెల 23న కూరగాయల సంత ప్రారంభిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గురువారం నిర్వహించే ఈ సంతను రైతులు, వ్యాపారులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కార్యదర్శులతో సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీవో చంద్రశేఖర్

ఖానాపూర్: గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన చర్యలు చేపట్టాలని ఎంపీవో చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో, ఎంపీడీవో సునీత సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన, తాగునీటి సరఫరాతోపాటు పంచాయతీల అభివృద్ధి గురించి చర్చించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు


లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో శనివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 39వ వార్షిత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం హోమం చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లన్న, వీడీసీ గంజాల గంగాధర్, పీరు పటేల్, భోజప్ప పటేల్, యోగేశ్, సత్యనారాయణ, రాంగోపాల్ ఉన్నారు.

'ఏరియాస్పత్రిలో దురుసుగా ప్రవర్తించారు'


గాయాలు చూపుతున్న సునీల్

భైంసాటౌన్: ద్విచక్రవాహనం పై నుంచి పడి గాయాలతో చికిత్స కోసం పట్టణంలోని ఏరియాస్పత్రికి వస్తే వైద్యసిబ్బంది తనతో దురుసుగా ప్రవర్తించారని పట్టణానికే చెందిన సునీల్ ఆరోపించారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంఎస్ పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడినట్లు పేర్కొన్నారు. చికిత్స కోసం ఏరియాస్పత్రికి వెళ్తే సిబ్బంది వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వాపోయాడు. గాయాలతో బెడ్‌పై పడుకుంటే చికిత్స అయిపోయింది.. బయటకు వెళ్లాలంటూ నర్సింగ్ ఆఫీసర్ సాయిచరణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఖానాపూర్: స్కిల్ ఇండియా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అకాడమీ బ్లాక్ మేనేజర్ మాలావత్ గణేశ్, ఏరియా మేనేజర్ ఆర్తి ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

ఆర్అండ్‌బీ.. అధికారులేరి..?

- సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం
- ఇన్‌చార్జి అధికారితో పర్యవేక్షణ కరువు
- అధ్వాన రోడ్లతో ప్రజలకు అవస్థలు


భైంసాలోని ఆర్అండ్‌బీ కార్యాలయం


ఖాళీగా దర్శనమిస్తున్న డీఈఈ కార్యాలయం

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసా ఆర్అండ్‌బీ కార్యాలయంలో సిబ్బంది లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. డీఈఈ పోస్టుతోపాటు మూడు ఏఈఈ పోస్టులు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ పోస్టులు మంజూరు కాగా, ఇన్‌చార్జి డీఈఈ, జూనియర్ అసిస్టెంట్ మినహా ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటెండర్ ఉన్నా డిప్యూటేషన్‌పై నిర్మల్‌లోని కార్యాలయానికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో కార్యాలయానికి ఎవరు వెళ్లినా సిబ్బంది లేక ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. బోథ్ డీఈఈకి భైంసా ఇన్‌చార్జి బాధ్యత అప్పగించడంతో ఆయన కార్యాలయానికి వచ్చిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో భైంసా ఆర్అండ్‌బీ కార్యాలయం సిబ్బంది లేక బోసిపోయి కనిపిస్తోంది.

అధ్వాన రోడ్లతో అవస్థలు...

భైంసా ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో భైంసా, కుభీర్, తానూరు, బాసర, ముధోల్, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండలాలున్నాయి. ఆయా మండలాల పరిధిలో ఆర్అండ్‌బీ రోడ్లు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా ఎలాంటి నూతన రోడ్ల పనులు చేపట్టడం లేదు. కానీ కొన్నిచోట్ల గత వానాకాలంలో వర్షాలకు రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయి. కొన్నిచోట్ల గుంతలు పడ్డాయి. రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి.

కొన్నిచోట్ల వాహనదారులను అప్రమత్తం చేసే సూచికబోర్డులు లేవు. రానున్నది వర్షాకాలం కావడంతో వాగుల ఉధృతికి, వాన నీటి ప్రవాహానికి రోడ్లు తెగే ప్రమాదముంది. దీంతో డీఈఈ ఒక్కరే ఉండటం.. అది కూడా ఇన్‌చార్జి అధికారి కావడంతో పర్యవేక్షణ, త్వరితగతిన పనులు చేపట్టడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. రెగ్యులర్ అధికారిని నియమించడంతోపాటు ఖాళీగా ఉన్న ఏఈఈ పోస్టులు భర్తీ చేస్తే భైంసాలో రోడ్లు భవనాల శాఖ గాడిన పడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇబ్బందులు లేకుండా చర్యలు

భైంసాలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో మూడు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాకు ఇన్‌చార్జి బాధ్యత అప్పగించడంతో రెండు చోట్ల సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– సునీల్, ఇన్‌చార్జి డీఈఈ, భైంసా

ఘనంగా వాసవీమాతకు పూజలు


పూజల్లో భక్తులు


కుంకుమపూజలు చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని సాకెర గ్రామంలో కన్యకాపరమేశ్వరి వాసవీమాత జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ అధ్యక్షులు అమెడ కిషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం అమ్మవారికి పదహారు కళశాలతో అభిషేకం, అలంకరణ, కుంకుమపూజ, పారాయణం, ఊయల, పల్లకిసేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వరిగడ్డి వృథాకు చెక్

- యంత్రంతో కట్టలు కట్టిస్తున్న రైతులు
- తక్కువ శ్రమ, ఎక్కువ నిల్వ ఉంటాయంటున్న అన్నదాతలు


మండల కేంద్రంలో గడ్డి కట్టలు కడుతున్న యంత్రం

లక్ష్మణచాంద: వ్యవసాయంలో యంత్రాల వినియోగం రోజురోజుకు అధికమవుతుంది. దీంతో తక్కువ శ్రమతో పనులు పూర్తవుతున్నాయి. గతంలో రైతులు వరి పొలాన్ని కూలీలతో కోయించేవారు. అనంతరం పైరును కుప్పగా వేసి పశువులతో తొక్కించి గడ్డిని వేరు చేసేవారు. దీంతో పశువులకు సరిపడా గడ్డి లభించేది. కానీ నేడు రైతులు హార్వెస్టర్‌తో పొలం కోయిస్తున్నారు. దీంతో వచ్చిన పశుగ్రాసాన్ని కట్టలు కట్టేందుకు రైతులు బేలర్(యంత్రం)ను వినియోగిస్తున్నారు. దీంతో గడ్డి వృథా తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఎకరాకు 40 నుంచి 50 కట్టలు..

హార్వెస్టర్‌తో వరి పొలం కోసిన తరువాత బేలర్‌ను ట్రాక్టర్‌కు బిగించి కట్టలు కడుతున్నారు. కోసిన పొలంలో బేలర్‌ను ట్రాక్టర్‌కు తగిలించడంతో భూమిపై పడిన వరిగడ్డిని సమకూర్చి కట్టలుగా మారుస్తుంది ఈ బేలర్ మిషన్. ఇలా ఎకరం పొలంలో గడ్డిని కట్టలుగా కట్టేందుకు గంట సమయం పడుతుంది. సుమారు ఎకరంలో 40 నుంచి 50 కట్టలు వస్తాయి. ఒక్కో కట్టకు బేలర్ యంత్రం యజమానులు రైతు నుంచి రూ.35 నుండి రూ.40 తీసుకుంటున్నారు. పాడి పశువులకు మేత కోసం తప్పనిసరిగా బేలర్ సాయంతో గడ్డిని కట్టలుగా కట్టించి తర్వాత వాటిని ఇంటికి ట్రాక్టర్‌లో తీసుకొస్తున్నారు. ఇంటి వద్ద గడ్డి కట్టలను నిల్వ చేసుకుంటున్నారు. మళ్లీ వానాకాలం పంట వచ్చే వరకు సరిపోయేలా పశుగ్రాసాన్ని రైతులు సమకూర్చుకుంటున్నారు.

మంచి డిమాండ్..

ఈ యాసంగిలో వరిగడ్డికి మంచి డిమాండ్ ఉంది. గతంలో రైతులు పొలం కోసిన తర్వాత వరి గడ్డిని కాల్చివేసేవారు. కానీ ఇప్పుడు పశువులకు గ్రాసం తప్పనిసరి కావడంతో వరి గడ్డిని కాల్చకుండా రైతులు కట్టలు కట్టించి విక్రయిస్తున్నారు. వరిగడ్డి లేని రైతులు ఒక్కో కట్టకు రూ.70నుంచి రూ.80 వరకు చెల్లించి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు.

కట్టలతో ఎక్కువ నిల్వ



నాకు రెండు గేదెలు ఉన్నాయి. వాటి మేత కోసం ఎకరంలో వరిగడ్డిని కట్టలు కట్టించి ఇంటి వద్ద నిల్వ చేశా. కట్టలు కట్టడంతో గతంలో కంటే గడ్డి ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుంది. శ్రమ కూడా తక్కువ.

– గంగారాం, పొట్టపెల్లి

ఖర్చులు తగ్గాయి



గతంలో వరి గడ్డిని ఎదిరి దానిని వాము వేయడానికి రోజుకు ఒక్కో కూలికి రూ.500 అయ్యేవి. బేలర్ యంత్రం వచ్చి వరిగడ్డి కట్టలు కట్టడంతో కూలీల ఖర్చులు తగ్గాయి. దీనికి తోడు సమయం వృథా కావడం లేదు.

– గంగన్న, లక్ష్మణచాంద

క్రీడాకారిణికి ఎమ్మెల్యే చేయూత


క్రీడాకారిణితో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన కిక్‌బాక్సింగ్ క్రీడాకారిణి కర్కూరి నాగలక్ష్మి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికస్థోమత లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు క్రీడాకారిణికి రూ.20 వేలను కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. ఈనెల 21న పుణెలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి తల్లి దండ్రులతో పాటు గ్రామానికి పేరు తీసుకుని రావాలని నాయకులు నాగలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో దయానంద్, వెంకాగౌడ్, రమేశ్, శంకర్, రాజునాయక్, సచిన్, మాధవ్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ


వరప్రసాద్

లక్ష్మణచాంద: టీఎస్ ఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని కనకాపూర్ విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. గ్రామానికి చెందిన గొట్టిముక్కల మోహన్–వాణి దంపతుల కుమారుడు భవాని వరప్రసాద్ అనే విద్యార్థి 89.43 మార్కులతో రాష్ట్రస్థాయిలో 1,828వ ర్యాంకు సాధించారు. ఇతడు పదో తరగతి జ్యోతిబాపూలే గురుకులంలో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివాడు.

నీటి వృథా అరికట్టరూ..



భైంసారూరల్: అసలే వేసవికాలం.. గుక్కెడు నీటి కోసం ప్రజలు, మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ భైంసా మండలంలోని కుంసర గ్రామంలో నల్లాకు ఆనాఫ్ పరికరాలు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. కరెంట్ ఉన్నంత సేపు రోజంతా బోరుమోటారు నీరు ఇలా వృథా అవుతుందని గ్రామస్తులు తెలిపారు. బోరుమోటారు వద్ద నల్లాకు ఆనాఫ్ ఏర్పాటు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్లు


తూకం వేస్తున్న హమాలీలు

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నెల రోజులుగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న పంట కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. గత నెల 18న కొనుగోళ్లు ప్రారంభం కాగా.. ఇప్పటివరకు 11,150 క్వింటాళ్ల పంటను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.3180 చెల్లిస్తుందని.. మరో వారం రోజుల పాటు కొనుగోళ్లు జరుగుతాయన్నారు. 20వేల క్వింటాళ్ల పంట కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల10 వరకు జొన్నల పంట విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్..

కుంగిన సీసీ రోడ్డు..!



భైంసాటౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా మదీనా కాలనీకి వెళ్లే దారిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆనుకుని ఉన్న సీసీ రోడ్డు కుంగింది. పగుళ్లు తేలి కూలేందుకు సిద్ధంగా ఉంది. వాహనదారులు గమనించక కింద పడే ప్రమాదం ఉంది. వచ్చేది వర్షాకాలం కావడంతో రోడ్డు కూలకముందే అధికారులు మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్,
ఫోన్: 98499 05889

విద్యార్థులతో పుస్తకాలు చదివించాలి


కథల పుస్తకాలతో విద్యార్థులు

కుంటాల: మేధాశక్తిని పెంపొందించేందుకు విద్యార్థులతో పుస్తకాలు చదివించాలని రూమ్ టు రీడ్ ఏరియా కోఆర్డినేటర్ రాము పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్ పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కథల పుస్తకాలు చదివించడంతోపాటు ఆటపాటలతో విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు 040–452–09722కి ఫోన్ చేసి నచ్చిన కథలు వినవచ్చని సూచించారు. వారి వెంట హెచ్‌ఎం ఎల్లన్న, వీవీ అఖిల తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


కుంటాలలో తేమ పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హనుమాన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంబకంటి, కుంటాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ బస్తాల కొరత లేకుండా చూడటంతోపాటు ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన లారీలను పంపిస్తామని పేర్కొన్నారు. వారి వెంట సీఈవో నాగభూషణం, ఏఈవో మహేశ్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రణయ్‌రావు, మహేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఆలయంలో భక్తులకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న మనోహర్

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో శనివారం పట్టణానికే చెందిన జొన్నల మనోహర్ దంపతులు తమ పెళ్లిరోజును పురస్కరించుకుని అన్నదానం చేశారు. సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంలో దాతల సహకారంతో భక్తుల కోసం నిత్యాన్నదానం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు తమ ఇళ్లల్లో జరిగే పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభకార్యాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే నిత్యాన్నదానంలో దాతలుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎవల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లక్ష్మణచాంద: మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఎవల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల మహిళలకు జీవనోపాధి కోసం నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ, టీసీ భీమ్, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ పండుగ


ఆలయం

ముధోల్: మండల కేంద్రంలో ఆదివారం నుంచి ఎల్లమ్మ పండగ ప్రారంభం కానున్నట్లు ముధోల్ మండల గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం ముధోల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 8:05గంటలకు పుణ్యాహవచనం, అభిషేకంతో పండగ ప్రారంభమవుతుందన్నారు. 20న సోమవారం ఏడంతస్తుల బోనం, ఎల్లమ్మ బోనాల ఊరేగింపు, 21న మంగళవారం అమ్మవారి కల్యాణ మహోత్సవం, అన్నదానం ఉంటుందని తెలిపారు. అందరూ హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు కార్తీక్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, మురళిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంజిగౌడ్, సాయిబాబాగౌడ్, దత్తాగౌడ్, వెంకటేశ్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, జి.దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.